నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, గురువారం 30 జనవరి 2025 | KHAMMAM


# కళ్లలో ఒత్తులేసుకొని..

## ఒక్క రోజే టింగ్ టింగ్.. తరువాత నో రింగ్..

రైతుభరోసా కింద ఈ సీజన్ పంటల పెట్టుబడి సాయం రూ.6 వేలను జనవరి 26న జమ చేస్తున్నామంటూ కాంగ్రెస్ సర్కారు ఇటీవల ఊరించడంతో ఊళ్లలోని రైతులందరూ ఆశగా ఎదురుచూశారు. కానీ 'ఇప్పుడు కేవలం ఎంపిక చేసిన గ్రామాల రైతులకే జమ చేస్తున్నాం.. మిగతా గ్రామాల రైతులందరికీ మార్చి 31లోపు జమ చేస్తాం' అంటూ ఆ తరువాత ప్రభుత్వం మాట తప్పడంతో పైలట్‌కు వెలుపలి గ్రామాల అన్నదాతల ఆశలన్నీ అడియాశలయ్యాయి. అయినప్పటికీ చాలామంది రైతులు కళ్లలో ఒత్తులేసుకొని మరీ ఎదురుచూస్తున్నారు. ఆ రోజు నుంచి ఇప్పటి వరకూ ప్రతి రోజూ తమ సెల్‌ఫోన్లలోకి చూస్తూ మెసేజీలను పరిశీలించుకుంటుకున్నారు. ఇప్పటికే మూడు సీజన్లవి పెండింగ్‌లో ఉండడం, తాజాగా ఈ నెల 27న పైలట్ గ్రామాల్లోని కొద్దిమంది రైతులకు పంటల సాయం జమకావడం వంటి పరిణామాల నేపథ్యంలో.. ప్రభుత్వం తొలుత చెప్పినట్లుగా తమకు పంటల సాయం జమ చేస్తుందేమోననుకుంటూ కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో ఏ రైతును గమనించినా క్షణానికోసారి సెల్‌ఫోన్లలో మెసేజీలు చెక్ చేసుకుంటున్న దృశ్యాలు, బ్యాంకుల వద్ద ఖాతాల్లో బ్యాలెన్స్ పరిశీలించుకుంటున్న దృశ్యాలే కన్పిస్తున్నాయి. రైతుభరోసా కోసం అన్నదాతలు ఎంతలా ఎదురుచూస్తున్నారో అనేందుకు ఇలాంటి దృశ్యాలే అన్ని గ్రామాల్లోనూ కన్పిస్తున్నాయి.

*- భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 29 (నమస్తే తెలంగాణ)*



తిప్పనపల్లి గ్రామం, చండ్రుగొండ మండలం

- పైలట్ గ్రామాల్లోని లబ్ధిదారులకూ పూర్తిగా జమకాని పంటల పెట్టుబడి సాయం
- తమకు తర్వాత పడతాయేమోననుకుంటూ జమకాని రైతుల పడిగాపులు
- ఎంపికైన గ్రామాల్లోని కొందరికి పడడంతో మిగతా గ్రామాల రైతుల్లోనూ ఆశలు
- 'భరోసా' మెసేజీల కోసం మూడు రోజులుగా మొబైల్ ఫోన్లతో ఎదురుచూపులు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎంపిక చేసిన 22 గ్రామాల రైతులకే 'భరోసా'..
- మిగతా గ్రామాల రైతులకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్న అధికారులు
- 1,87,597 మంది రైతులగాను కేవలం 22,125 మందికే పంటల సాయం జమ

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జిల్లా రైతులకు ఎదురుచూపులు తప్ప మరేమీ మిగలగడం లేదు. కళ్లలో ఒత్తులేసుకొని మరీ వేచిచూసినా రైతుభరోసా మాత్రం రావడం లేదు. తొలుత వానకాలం పంటకు రాలేదు. తరువాతి యాసంగి సీజన్‌కూ రాలేదు. నిన్నా మొన్న చెప్పిన గడువుల్లోనూ జమ కాలేదు. దీంతో పంటల పెట్టుబడి కోసం అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు. జనవరి 26న జమ చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించిన వెంటనే అన్నదాతలందరూ ఎంతో ఆశపడ్డారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూశారు. 'గణతంత్ర దినోత్సవాన బ్యాంకులకు సెలవు కావడంతో ఆ రోజు అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు (జనవరి 27) ఉదయం వరకూ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి' అని ప్రకటించడంతో కాస్త నిట్టూర్చారు. కానీ జనవరి 27న ఎంపిక చేసిన గ్రామాల రైతులకేనని, మిగిలిన గ్రామాల రైతులకు మార్చి 31లోపు జమస్తామని ప్రభుత్వం మళ్లీ ప్రకటించడంతో ఒక్కసారిగా నీరసించిపోయారు. కానీ ఒకవేళ ప్రభుత్వం పంటల సాయాన్ని జమ చేస్తుందేమోనన్న అపోహతో రోజూ సెల్‌ఫోన్ల వైపే ఆశగా చూస్తున్నారు.


రైతుభరోసా వస్తుందని సెల్‌ఫోన్‌లో మెసేజ్ చూసుకుంటున్న రైతు

### కేవలం 22 గ్రామాల రైతులకే..

భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా కేవలం 22 పైలట్ గ్రామాల రైతులకే రైతుభరోసా జమ కావడంతో మిగిలిన గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమకెందుకు జమ చేయడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చండ్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో జనవరి 29న 'నమస్తే తెలంగాణ' చేసిన క్షేత్రపరిశీలనలో కొన్ని ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వం చెప్పిన గడువైన జనవరి 26, 27 తేదీలు ముగిసి రెండు మూడు రోజులు దాటినా చాలా మంది రైతులు ఇప్పటికీ క్షణక్షణానికీ తమ సెల్‌ఫోన్ల మెసేజీలు చెక్ చేసుకుంటున్నారు. వీరిలో కొందరు రైతులను 'నమస్తే' పలుకరించగా.. 'రెండు రోజులుగా ఎదురుచూస్తున్నా కనీసం మా మెసేజ్‌లు కూడా రాలేదు' అంటూ వాపోతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో తమ గ్రామంలో మొత్తం 550 మంది రైతులకు రైతుబంధు పంటల పెట్టుబడి సాయం అందేదని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకూ రైతుభరోసా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇటీవల తమ ఊరిలో ప్రభుత్వం గ్రామసభ పెట్టిందని, అర్హులైన రైతుల జాబితాను ప్రకటించిందని చెప్పారు. కానీ అలా ప్రకటించిన రైతుల్లో ఒక్కరికి కూడా, కనీసం ఎకరం సాగుభూమి ఉన్న వాళ్లకు కూడా రైతుభరోసాను జమ చేయలేదని విమర్శించారు. మరి పెట్టుబడి సాయం జమ చేయకుంటే గ్రామసభలు ఎందుకు పెట్టారని? జాబితాను ఎందుకు ప్రకటించారని రైతు కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి.

### 1,87,597 మందిలో 22,125 మందికే జమ..

భద్రాద్రి జిల్లాలో జరిగిన గ్రామసభల్లో అర్హులైన రైతులను గుర్తించారు. మొత్తంగా 1,87,597 మందికి రైతుభరోసా ఇస్తామని ప్రకటించారు. కానీ ఇందులో ఆఖరికి 22 పైలట్ గ్రామాలను ఎంపిక చేసి వాటిల్లో ఎంపిక చేసిన కేవలం 22,125 మంది రైతులకే మాత్రమే రైతుభరోసా నిధులు విడుదల చేశారు. కానీ వీరిలోనూ చాలామందికి పంటల సాయం జమ కాలేదు.

### సమాధానం చెప్పలేక అధికారులు సతమతం..

అయితే, పైలట్ గ్రామాలు మినహా మిగతా రైతులకు రైతుభరోసా జమ కాకపోవడంతో ఆయా రైతులందరూ అధికారుల వద్దకు, రైతు వేదికల వద్దకు పరుగులు తీస్తున్నారు. తమకెందుకు రైతుభరోసా జమ కాలేదంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. దీంతో, 'తొలుత పైలట్ గ్రామాల రైతులకే ప్రభుత్వం జమ చేసింది. మిగిలిన గ్రామాల రైతులకు తరువాత జమ చేస్తుంది' అంటూ సమాధానం చెబుతున్నారు. అయితే, 'వాళ్లు మాత్రమే రైతులా? మేము రైతులం కాదా?' అంటూ అన్నదాతలు నిలదీస్తుండడంతో సమాధానం చెప్పలేక అధికారులు సతమతమవుతున్నారు.

### నాకు రైతుభరోసా రాలేదు..



నాకు ఎకరం పొలం ఉంది. కానీ ఇంత వరకూ రైతుభరోసా రాలేదు. ఈ ప్రభుత్వం ఇప్పటికే ఒక పంటకు పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టింది. రెండో పంటకు ఇస్తుందనుకుంటే అదీ ఇవ్వలేదు. జనవరి 26న ఇస్తామని మొన్న ప్రకటించారు. కానీ మాకు మాత్రం రాలేదు. మా ఊరిలో ఎవరికీ జమ కాలేదు. ఎకరం పొలం ఉన్న వాళ్లకు మొదటగానే వస్తుందన్నారు. కానీ రాలేదు. బ్యాంకుకు వెళ్లి చూశాను. రైతుభరోసా జమకాలేదని బ్యాంకోళ్లు చెప్పారు.

**–బి.ఈర్యా, రైతు, తిప్పనపల్లి, చండ్రుగొండ**

### రెండు రోజులుగా ఫోన్ మెసేజీలు చూస్తూనే ఉన్నారు..



జనవరి 27న రైతుభరోసా జమ అయిందని, ఫోన్లన్నీ టింగ్ టింగ్ మని మోగాయని చెప్పారు. కానీ నా ఫోన్ మాత్రం మోగనే మోగలేదు. రెండు రోజులుగా ఫోన్‌ను పట్టుకొని చూస్తున్నా. అయినా నా ఫోన్‌కు రైతుభరోసా మెసేజ్ రాలేదు. నాకే కాదు.. మా ఊరిలో ఎవరికీ రాలేదు. కానీ జనవరి 26నే రైతుభరోసా వేస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ వేయలేదు. కేవలం గ్రామసభల్లో రైతుల పేర్లు మాత్రమే చదివారు.

**– అంచం యూకయ్య, రైతు, తిప్పనపల్లి చండ్రుగొండ**

### ఏ పథకం కూడా రాలేదు..



మాది నిరుపేద కుటుంబం. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ ఒక్క పథకంలోనూ నా పేరు రాలేదు. అంటే అన్నింటికి అనర్హురాలినని తేల్చినట్లున్నారు. కానీ గతంలో పథకాలు వచ్చిన వారికే ఇప్పుడు మళ్లీ వచ్చాయి. ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, గృహజ్యోతి పథకాలు కూడా వర్తించలేదు. మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు.

**–సుబ్బలక్ష్మి, నందిగామ, మణుగూరు**

### పేదలకే ఇస్తామన్నారు.. మరి ఎందుకు ఇవ్వడం లేదు?



పథకాల్లో పేదలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. కానీ అసలైన పేదలకు పథకాలను ఇవ్వడం లేదు. డబ్బున్న వాళ్లకే పథకాలన్నీ ఇస్తోంది. అయితే అర్హుల జాబితాలో మా పేరు రాలేదంటే మేమంతా ఉన్నోళ్లమా? ఇదే విషయంపై అధికారులను ప్రశ్నిస్తే వారేమీ సమాధానం చెప్పడం లేదు. ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకుంటే లిస్టులో నా పేరు రాలేదు.

**–కాపు లక్ష్మి, నందిగామ, మణుగూరు**

# కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ఎండగట్టండి..

- నేడు గాంధీ విగ్రహాలకు వినతులతో నిరసన
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మణుగూరు టౌన్, జనవరి 29 : బూటకపు 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ఎండగట్టాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిరసన తెలుపుతూ అన్ని మండల కేంద్రాల్లో గురువారం మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. గాంధీ పేరు చెప్పుకుని గద్దెనెక్కిన డూప్లికేట్ గాంధీలకు బుద్ధి వచ్చేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రుణమాఫీ, పింఛన్ల పెంపు అంటూ మాయమాటలు చెప్పారని, నేతల హడావిడి తప్ప రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప వారు ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

# నేడు గాంధీ విగ్రహాలకు వినతులు

### మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పిలుపు


వనమా వెంకటేశ్వరరావు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించాలని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. రూ.12 వేలు ఇవ్వడం కూడా చేతకావడం లేదని విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వం నిరుపేదలకు రేషన్ కార్డులు ఇచ్చినా.. ఇవ్వలేదని అబద్ధపు ప్రచారం చేయడం సరికాదన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఇప్పుడు నియామక పత్రాలు ఇస్తూ తాము ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఇవన్నీ నిరుద్యోగులు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గురువారం జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని ధర్నా

### అర్హులకు పథకాలు వర్తింపజేయాలని 'మాస్‌లైన్' నాయకుల డిమాండ్



రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

ఖమ్మం రూరల్, జనవరి 29 : ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన విధంగా ఆరు గ్యారెంటీ పథకాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి మలీదు నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని చెప్పి కొంతమందికే కల్పించి, మిగతా వారిని విస్మరించిందని ఆరోపించారు. వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల చొప్పున చెల్లిస్తామని చెప్పి దానిని విస్మరించిందన్నారు. సొంత జాగా ఉన్న వారికి ఇందిరమ్మ ఇంటి కోసం రూ.5 లక్షలు, రైతు భరోసా పథకం ద్వారా రూ.15 వేలు, అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు రెంటాల యాదగిరి, వీర్ల వెంకటనారాయణ, ఎడ్లపల్లి ఉపేందర్, బాల్ని యాదగిరి, మాధవరావు, మోహన్‌రెడ్డి, రామదాసు, శ్రీను, లలిత, కోటయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయండి

- వేసవిలో తాగునీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్


మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారు చేసుకున్న దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్.. అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత అధికారులతో సంక్షేమ పథకాల అమలు, పీఎం కుసుమ్ పథకం, వేసవిలో నీటి కొరత రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, ప్లాంటేషన్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను గురువారం ఉదయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. చర్ల 23, దుమ్ముగూడెం 23, అశ్వాపురం 3, మణుగూరు 7, బూర్గంపాడులో ఒక దరఖాస్తు ఆన్‌లైన్ చేయాల్సి ఉందని, వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో కొత్తగా వచ్చిన 3,403 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఉపాధిహామీలో 20 రోజుల పని దినాల కంటే ఎక్కువ ఉన్న వారిని గుర్తించాలన్నారు. వీటిని ఈ నెల 31వ తేదీలోపు పరిశీలించి నివేదిక అందించాలన్నారు. కొత్త రేషన్ కార్డు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం ద్వారా అర్హులకు డిజిటల్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వేసవిలో తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. హరితహారంలో ఇప్ప, ముష్టి, తంగేడు, మునగ, సుబాబుల్, సిస్సు, టకోమో, మందారం తదితర మొక్కలను నాటడం ద్వారా గిరిజనులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీవో చంద్రమౌళి, పీడీ హౌసింగ్ శంకర్, జీఎం ఇండస్ట్రీస్ తిరుపతయ్య, ఎల్‌డీఎం రామిరెడ్డి, డీఈవో వెంకటేశ్వ రాచారి, సెర్ప్ పీడీ నీలేష్, అదనపు డీఆర్‌డీవో రవి తదితరులు పాల్గొన్నారు.

# పినపాక అడవుల్లో పులి!

- భయాందోళనలో సమీప గ్రామాల ప్రజలు
- గాలింపు చర్యలు చేపట్టిన అటవీ శాఖ అధికారులు

పినపాక, జనవరి 29 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. పోట్లపల్లి గ్రామ సమీపంలోని అడవుల్లో మంగళవారం పులి సంచరించినట్లు గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఈ బయ్యారం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉపేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా విడిపోయి పులి జాడ కోసం అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం కూడా పులి అడుగుల కోసం తీవ్రంగా అన్వేషించారు. ఈ విషయమై రేంజ్ ఆఫీసర్‌ను వివరణ కోరగా.. పోట్లపల్లి అటవీ ప్రాంతంలో పులి సంచరించినట్లు గ్రామస్తుల ద్వారా తెలుసుకున్నామని, తమ బృందాల ద్వారా అన్వేషించగా పులి అడుగులను గుర్తించినట్లు తెలిపారు. అయితే పులి ఈ ప్రాంతంలోనే సంచరిస్తున్నదా? లేదా వేరే ప్రాంతానికి వెళ్లిపోయిందా? అనే విషయం తెలియాల్సి ఉందన్నారు. అటవీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పశువుల కాపరులు, ప్రజలు ఒంటరిగా అడవుల్లోకి వెళ్లొద్దని సూచించారు.

# బీఆర్‌టీయూది కార్మికుల పక్షం

### ప్రచారంలో దూసుకుపోతున్న మిత్రపక్షాల బాణం గుర్తు

### బీఆర్‌టీయూ మిత్రపక్షాల జనరల్ బాడీ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

బూర్గంపహాడ్, జనవరి 29 : నిబద్ధత, నిజాయితీతో కార్మికుల సంక్షేమానికి పాటుపడేది, వారి పక్షాన నిలిచేది బీఆర్‌టీయూ మాత్రమేనని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో గుర్తింపు ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమని, ఈ ఎన్నికల్లో బీఆర్‌టీయూ మిత్రపక్షాల 'బాణం' గుర్తు దూసుకుపోతున్నదని పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఐటీసీ గేట్ వద్ద జరిగిన బీఆర్‌టీయూ మిత్రపక్షాల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాంబాబు, ఆలిండియా సీఐటీయూ కార్యదర్శి ఎం.సాయిబాబు, ఉద్యమకారుడు బొమ్మెర రామ్మూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేశ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. గత 13 ఒప్పందాల్లో ఆ రెండు యూనియన్లు కార్మికులకు చేసింది ఏమీలేదని, కార్మికుల సంక్షేమాన్ని వదిలి కాంట్రాక్టులు దక్కించుకొని ఆస్తులు కూడబెట్టుకున్నాయని ఆరోపించారు. ఈసారి జరిగే గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు ఆలోచించి బీఆర్‌టీయూ మిత్రపక్షాల గెలుపు కోసం ఓటు వేయాలన్నారు. బీఆర్‌టీయూ మిత్రపక్షాలు 14వ వేతన ఒప్పందం కోసం 14 అంశాలను మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టి భవిష్యత్ తరాల తలరాతలు మార్చే విజయం కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాంబాబు మాట్లాడుతూ కార్మికుల శ్రమను ఐటీసీ యాజమాన్యం దోచుకుంటున్నదని ఆరోపించారు. గత యూనియన్లు కార్మికుల సంక్షేమాన్ని పక్కన పెట్టి, యాజమాన్యంతో కలిసి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆలిండియా సీఐటీయూ కార్యదర్శి ఎం.సాయిబాబు మాట్లాడుతూ 45 ఏళ్లుగా పనిచేసిన ఆ రెండు యూనియన్లు 13 వేతన ఒప్పందాల్లో కార్మికులకు చేసింది శూన్యమన్నారు. తొలుత బీఆర్‌టీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో సారపాక, భద్రాచలం, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామాల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే అజీమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.హరినాథ్, సీఐటీయూ అధ్యక్షుడు కె.ప్రవీణ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఐఈయూ ప్రధాన కార్యదర్శి ఎండి.సాబీర్, ఐఈయూ అధ్యక్షుడు శిక్షావలి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆర్గనైజేషన్ బాధ్యులు నర్సింహారావు, డి.ప్రశాంత్, బహుజన నాయకులు మధుమహరాజ్, శ్రీపాద రవికుమార్, గద్దల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీశ్, పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాస్, బెజ్జంకి కనకాచారి, బొల్లు సాంబ పాల్గొన్నారు.


శ్రీ కాకతీయ
కిడ్నీ & డయాలసిస్ హాస్పిటల్
5వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
5th ANNIVERSARY
మా ఈ 5 సంవత్సరాల ప్రయాణంలో మాకు సహకరించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ప్రజలకు హాస్పిటల్ సిబ్బందికి 5వ వార్షికోత్సవం సందర్భంగా ఇవే మా హృదయ పూర్వక ధన్యవాదములు...
డా॥ మనోజ్ యాలముడి MD,DM
నెఫ్రాలజీ
24x7 నెఫ్రాలజిస్ట్ సేవలు గల ఏకైక హాస్పిటల్
వైరారోడ్, ఆర్.సి.ఎం. చర్చి ఎదురుగా, అంకుర హాస్పిటల్ రోడ్, ఖమ్మం.
Cell: 9951164604, 7989346402

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616